సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 12 : జూలై : 2024



ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం

మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని ఆదివాసీల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. 8లో



రేషన్ బియ్యం స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 25°

జిల్లాలో శుక్రవారం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బదిలీల కోసం పైరవీల జోరు..

రూ. లక్షలు వసూలు చేస్తున్న కొందరు కార్మిక నేతలు

పాల్వంచ: కొత్త ప్రభుత్వం ఏర్పడగానే జెన్‌కో సంస్థలో బదిలీల కోసం పైరవీల బాట పట్టారు. కొన్ని కార్మిక సంఘాల నేతలు రూ. లక్షలకు బేరం కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ట్రాన్స్‌కో నుంచి జెన్‌కోకు బదిలీ అయిన ఫోర్ మెన్‌లు తమకు ఉన్న పరిచయాలను ఆసరా చేసుకుని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నుంచి పాల్వంచ కేటీపీఎస్‌కు, లేదా హైదరాబాద్ విద్యుత్ సౌధకు బదిలీలకు ముమ్మరంగా పైరవీలు చేస్తున్నారు. బదిలీల కోసం తాము మంత్రుల వద్దకు వెళ్లి వస్తున్నామని నమ్మబలుకుతున్నారు. ఒక్కో బదిలీకి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేస్తుండటంతో సామాన్య కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై వేటు

లక్ష్మణ్‌రావుకు హైదరాబాద్ బదిలీ



ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావుపై ప్రభుత్వం వేటు వేసింది. వైద్య కళాశాల నిధులు, అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు ఆయన్ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పోస్టు నుంచి తప్పించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియాకు బదిలీ చేస్తూ హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్‌గా మూడు రోజుల్లో మరొకరిని నియమించనున్నట్లు సమాచారం. కాగా ప్రిన్సిపాల్ అసభ్యంగా మాట్లాడుతున్నారని, వేధిస్తున్నారని గత మార్చిలో వైద్య విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలిపిన విషయం విదితమే.

నేడు ఆప్షన్లకు తుది గడువు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారంతో ఆప్షన్స్ గడువు ముగియనుంది. మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లు ఏడుగురు, బిల్ కలెక్టర్లు ఇద్దరు, సీనియర్ అసిస్టెంట్ ఒకరు, హెల్త్ అసిస్టెంట్ ఒకరు, మేనేజర్ ఒకరు సీనియారిటీ జాబితాలో ఉన్నారు. బదిలీల ప్రక్రియలో భాగంగా 12న ఆప్షన్స్ గడువు ముగిశాక, 13, 14వ తేదీల్లో స్క్రూట్నీ చేస్తారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులకు కలెక్టరేట్‌లో, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు వరంగల్ రీజినల్ కార్యాలయంలో, మేనేజర్‌స్థాయి అధికారులకు హైదరాబాద్‌లోని సీడీఎంఏలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదీ లోగా బదిలీ ఆర్డర్లు ఇవ్వనుండగా, బదిలీల ప్రక్రియ అంతా 20వ తేదీ లోగా పూర్తి కానుంది.

నిలిచిన రిజిస్ట్రేషన్లు


కొత్తగూడెం అర్బన్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో గురువారం రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. ఉదయమే కార్యాలయాలకు వచ్చిన సబ్ రిజిస్ట్రార్లు సైట్‌లో లాగిన్ అయ్యేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. ఆధార్ సర్వర్ సేవలు నిలవడంతో బయోమెట్రిక్ చేయలేకపోయారు. ఆపై డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు వినియోగదారుల ఆధార్ నంబర్ల ప్రకారం వేలిముద్ర తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ బయోమెట్రిక్ వెరిఫికేషన్ జరగక ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. అన్ని కార్యాలయాల్లో కలిపి రోజుకు 250 నుండి 300 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతుండగా.. శాఖకు రూ.కోటి మేర ఆదాయం సమకూరేది. సాంకేతిక లోపంతో ఆ ఆదాయాన్ని కోల్పోయినట్లయింది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా ఈ సేవలు నిలిచిపోయాయని అధికారులు వెల్లడించారు. కాగా, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న పలువురు సాయంత్రం వరకు కార్యాలయాల్లో పడిగాపులు కాసినా ఫలితం లేక నిరాశగా వెనుదిరిగారు.

ఎన్‌హెచ్‌-30 అలైన్‌మెంట్ మార్చితే..

ప్రశాంత దర్శనం

భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపించాలని పేర్కొంటున్నారు. ఇందుకు జాతీయ రహదారి–30 విస్తరణ సమయమే మంచి అవకాశమని చెబుతున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





ఎన్‌హెచ్‌-30పై పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద వాహనాల రద్దీ, (ఇన్‌సెట్) భక్తుల సందడి (ఫైల్)

పెద్దమ్మతల్లి ఆలయానికి పెరిగిన భక్తుల రద్దీ

- జాతీయ రహదారితో తరచుగా ట్రాఫిక్ చిక్కులు
- హైవేలో స్వల్ప మార్పులు చేస్తే ఎంతో మేలు
- గుడి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవకాశం

ఇంటి ఇలవేల్పుగా

భద్రాచలం వెళ్లే దారిలో కిన్నెరసాని తీరంలో దట్టమైన అడవుల మధ్య పెద్ద పులుల నుంచి అభయం ఇచ్చేందుకు చెట్టు నీడన పెద్దమ్మ తల్లి అమ్మవారు వెలిశారు. కాలక్రమంలో భక్తుల ఇంటి ఇలవేల్పుగా తల్లి ప్రసిద్ధి చెందింది. విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారి ఎన్‌హెచ్‌–30పై ఆలయం ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారుల్లో చాలా మంది కనీసం క్షణకాలమైన ఇక్కడ వాహనాన్ని ఆపి అమ్మవారికి దండం పెట్టుకుని వెళ్తుంటారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, సారపాక పట్టణాలకు చెందిన వారు తమ ఇంటి శుభకార్యాలను పెద్దమ్మ తల్లి చెంతన జరిపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

పెరిగిన రద్దీ

గడిచిన రెండు దశాబ్దాలుగా పెద్దమ్మ తల్లి ఆలయం ఆధారంగా ఎన్‌హెచ్‌–30 రహదారికి ఇరువైపులా జగన్నాథపురం – కేశవాపురం గ్రామాలు అభివృద్ధి చెందాయి. ప్రైవేటు రంగంలో అనేక ఫంక్షన్ హాళ్లు వచ్చాయి. దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనూ ఫంక్షన్ హాల్స్‌తో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయం చుట్టూ చేపట్టిన క్యూలైన్ల నిర్మాణాలు సైతం జాతీయ రహదారి వరకు వచ్చి ఆగిపోయాయి. భవిష్యత్‌లో ఆలయం చుట్టూ ఏ తరహా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఫలితంగా సెలవులు, పండగ రోజుల్లో ఎన్‌హెచ్‌పై అటు ఇటు రాకపోకలు సాగించే భారీ వాహనాల రొద మధ్యనే అమ్మవారిని దర్శనం చేసుకోవాల్సి వస్తోంది. కుటుంబ సమేతంగా గుడికి వెళ్లిన వారికి తమ వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. స్థల లభ్యత లేని కారణంగా ప్రధాన ఆలయానికి దూరంగా వాహనాలకు పూజలు జరిపించుకోవాల్సి వస్తోంది. సెలవులు, పర్వదినాల్లో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

మాస్టర్ ప్లాన్‌కు అడ్డుగా..

భవిష్యత్‌లో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని పెద్దమ్మ తల్లి ఆలయానికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలనే అంశం ఏళ్ల తరబడి నోటిమాటగానే మిగిలిపోతోంది. ఆలయం దగ్గర ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఎన్‌హెచ్‌–30తో ముడిపడి ఉండటం మాస్టర్ ప్లాన్‌కు ప్రధాన ప్రతిబంధకంగా మారింది. పెద్దమ్మ తల్లి ఆలయం దగ్గర నెలకొన్న సమస్యలకు పరిష్కారంగా భారీ వాహనాలు, దూర ప్రాంతాలకు వెళ్లే ఇతర వాహనాలు ఆలయం ముందుకు రాకుండా వెళ్లేలా ఎన్‌హెచ్‌–30 అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేయాలని భక్తులు కోరుతున్నారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని, ప్రశాంతంగా దర్శనం చేసుకునే వీలుంటుందని చెబుతున్నారు.

రెండో వంతెనతో..

ఇటీవల ఎన్‌హెచ్‌–30 విస్తరణలో భాగంగా పెద్దమ్మతల్లి ఆలయానికి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న కిన్నెరసాని నదిపై రెండో వంతెనకు రూ.20.22 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రస్తుతం ఉన్న పాత వంతెనకు సమాంతరంగా కొత్త వంతెన నిర్మాణం చేపట్టబోతున్నారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఈ రోడ్డుపై దృష్టి సారించనున్నారు. ఇదే అదనుగా పెద్దమ్మగుడి ఆలయం ముందు నుంచి వెళ్తున్న జాతీయ రహదారి అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసేలా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సూచనలు చేసి ఆలయ అభివృద్ధికి బాటలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కిన్నెరసాని పాత వంతెన

ఆదర్శంగా ఉండాలి

కేంద్ర ప్రభారీ అధికారి డాక్టర్ యోగితా రాణా



మాట్లాడుతున్న కేంద్ర ప్రభారీ అధికారి డాక్టర్ యోగితా రాణా

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంపూర్ణతా అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని ఆస్పిరేషన్ జిల్లాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదర్శంగా ఉండాలని వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ, కేంద్ర ప్రభారీ అధికారి డాక్టర్ యోగితా రాణా సూచించారు. గురువారం ఐడీఓసీలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. గుండాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సంపూర్ణతా అభియాన్ లక్ష్యాలను వందశాతం సాధించాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. ప్రతి రైతు భూమిలో భూసార పరీక్షలు నిర్వహించాలని, కొత్తగూడెంలో భూసార పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని, అప్పటివరకు వ్యవసాయ కళాశాలలోని పరీక్ష కేంద్రం ద్వారా భూసార పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో అంధ, మూగ, చెవిటి పిల్లల కోసం ప్రత్యేక చాంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభారీ కార్యదర్శి పవన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కె.వి.కె సైంటిస్ట్ డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు, సీపీఓ శ్రీనివాసరావు, జిల్లా వైద్య శాఖ అధికారి ఎల్.భాస్కర్, వ్యవసాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అర్జునరావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి, మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత, పశుసంవర్ధక శాఖ అధికారి పురందరేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, గుండాల ఎంపీడీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



చెక్‌డ్యాం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న యోగితా రాణా, కలెక్టర్ జితేష్ తదితరులు


సుజాతనగర్: ఎదులవాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ, కేంద్ర ప్రభారీ అధికారి డాక్టర్ యోగితా రాణా గురువారం పరిశీలించారు. నీటి పారుదల శాఖ అధికారులు, రైతులతో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. వేపలగడ్డలోని గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి గర్భిణికి సీమంతం నిర్వహించారు. అనంతరం సర్వారంలోని హెల్త్ సబ్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. పల్లె దవా ఖానాలో మందుల స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి వేల్పుల విజేత, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ కూచిపూడి నాగరాజు, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీఓ ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సుదతి పాల్గొన్నారు.

మెడికల్ బోర్డ్‌లో 155 మంది ఇన్‌వాలిడేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన మెడికల్ బోర్డ్‌లో 155 మంది ఇన్‌వాలిడేషన్ అయ్యారు. సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి 204 మంది కార్మికులను ఎంపిక చేసి బోర్డ్‌కు పిలవగా, వారిలో 30 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 174 మంది హాజరుకాగా 155 మందిని ఇన్‌వాలిడేషన్‌గా గుర్తించారు. 19 మందిని హయ్యర్ రిఫరల్‌కు, ఫిట్ ఫర్ సేమ్ జాబ్‌కు పంపినట్లు సమాచారం.

‘పద్మశ్రీ’ కుటుంబానికి సాయం అందేనా..?

ఎదురుచూస్తున్న సకిని రామచంద్రయ్య కుటుంబం



సకిని రామచంద్రయ్య (ఫైల్)

మణుగూరు టౌన్: పద్మశ్రీ సకిని రామచంద్రయ్యకు ప్రభుత్వం ప్రకటించిన ఇంటి స్థలం, రూ. కోటి నగదును ఆయన కుటుంబానికి అందుతుందో? లేదోననే అయోమయం నెలకొంది. కంచు తాళం, మేళంతో కోయ కథలు వివరించే కథకుడు రామచంద్రయ్య మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో కీలకంగా వ్యవహరించేవాడు. మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన ఇతనికి 2022 జనవరిలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు బహూకరించింది. ఆ సమయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నగదు, జిల్లా కేంద్రంలో 462 గజాల ఇంటి స్థలం ప్రకటించగా, హామీకే పరిమితమైంది. గత నెల 23న గొంతు సంబంధిత వ్యాధి, ఇతర అనారోగ్య సమస్యలతో రామచంద్రయ్య మృతి చెందిన విషయం విదితమే. దీంతో కుటుంబ పరామర్శకు వచ్చిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభ్యర్థన మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌తో మాట్లాడి 462 గజాల స్థలానికి ప్రొసీడింగ్ కాపీని అందించారు. ఇంకా స్థలం అప్పగించలేదు. తాజాగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 లక్షల చెక్కుల అందించిన నేపథ్యంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన సకిని రామచంద్రయ్య కుటుంబానికి రావాల్సిన నగదు, ఇంటి స్థలాన్ని వేగంగా అందించి కుటుంబంపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

13.5 అడుగులకు గోదావరి..



భద్రాచలం వద్ద గోదావరిలో వరద ప్రవాహం

భద్రాచలంఅర్బన్: కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద ఉన్న గోదావరి నది నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం 12 అడుగులు ఉన్న నీటిమట్టం గురువారం సాయంత్రం 4 గంటల వరకు 13.8 అడుగులకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు మరో 0.7 అడుగులు పెరిగి 14.5 అడుగులకు చేరుకోనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

భద్రగిరికి ‘విభజన’ దెబ్బ !

- నిర్జీవంగా మారుతున్న భద్రాచలం
- రాష్ట్ర, జిల్లాల విభజనతో కుదేలు
- మూడు ముక్కలైతే మరింత వెనుకబాటు
- పట్టించుకోని నేతలు, ప్రజాప్రతినిధులు



భద్రాచలం పట్టణ వ్యూ

భద్రాచలం: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది భద్రాచలం పరిస్థితి. దక్షిణ అయోధ్యగా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు.. జిల్లాకు భద్రాద్రిగా పేరు.. ప్రాజెక్ట్‌లకు, పరిశ్రమలకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకూ భద్రాచలం లేదంటే సీతారాముల పేర్లు.. కానీ క్షేత్రస్థాయిలో భద్రాచలానికి మాత్రం తీరని అన్యాయం జరుగుతోంది. రాష్ట్ర విభజన సమయంలో ఈ నియోజకవర్గంలోని మూడు మండలాలు ఏపీలో, రెండు మండలాలు ములుగు జిల్లాలో విలీనం అయ్యాయి. భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న ఐదు గ్రామాలను ఏపీలో కలపడంతో దీని పరిధి కుంచించుకుపోయింది. ఇప్పటివరకు మేజర్ గ్రామ పంచాయతీగా ఉండగా, మూడు జీపీలుగా విభజిస్తే ఇక భద్రగిరి రాముడి గుడికి మాత్రమే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ప్రజాప్రతినిధులు, పాలకులు హామీలకే పరిమితమయ్యారు తప్ప ఇంతవరకు ఏ ఒక్క విభజననూ అడ్డుకోలేకపోయారు. దీంతో భద్రాచలంపై విభజన ‘రాజకీయం’ నడుస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు అతిపెద్ద నియోజకవర్గంగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం ఎనిమిది మండలాలతో ‘హెలికాప్టర్ నియోజకవర్గం’గా దేశంలోనే పేరుగాంచింది. ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన భద్రాచలం రూపురేఖలనే మార్చింది. రాష్ట్ర విభజనలో భాగంగా పోలవరం ముంపు పేరుతో ఈ డివిజన్‌లోని కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాలను ఒకేఒక్క ఆర్డినెన్స్‌తో పూర్తిగా ఏపీలో కలిపారు. ఇక భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న కన్నాయిగూడెం, పిచుకలపాడు, యటపాక, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలను సైతం ఏపీలో విలీనం చేశారు. దీంతో భద్రాచలం కేవలం దేవస్థానానికి మాత్రమే పరిమితమైంది. జిల్లాల విభజన మరోసారి భద్రాచలాన్ని దెబ్బ తీసింది. ఆ సమయంలో నియోజకవర్గంలో ఉన్న వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపారు. నియోజకవర్గంలో అధికారిక లెక్కల ప్రకారం ఐదు మండలాలు ఉన్నప్పటికీ పరిపాలనపరంగా మూడు మండలాలే జిల్లాలో ఉన్నాయి. ఇక భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడుగా విభజిస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన బిల్లును గవర్నర్ ఇటీవల ఆమోదించారు. దీంతో భద్రాచలం మూడు ముక్కలు కానుందనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది.

పార్టీల ప్రతిఘటన ఏదీ..?

భద్రాచలానికి ఇలా ప్రతీసారి అన్యాయం జరుగుతున్నా అధికార, ప్రతిపక్ష పార్టీలు చూస్తుండిపోతున్నాయే తప్ప ప్రతిఘటించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదు పంచాయతీలను ఏపీలో కలుపుతూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా.. నాటి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ మాట్లాడలేదని, అదే బీఆర్‌ఎస్ సర్కార్.. తన రాజకీయ ప్రయోజనాల కోసం భద్రాచలం నియోజకవర్గంలోని రెండు మండలాలను ఇష్టారీతిన ములుగు జిల్లాలో కలిపిందనే విమర్శలు సైతం వచ్చాయి. ఇప్పుడు మూడు జీపీల బిల్లును బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. భద్రాచలానికి ఈ పదేళ్లలో పలుమార్లు అన్యాయం జరుగుతున్నా విపక్ష పార్టీలు కూడా అడ్డుకోలేకపోయాయి. పోరాటాల గడ్డగా పేరుగాంచిన కమ్యూనిస్టుల అడ్డాలో ఆ పార్టీలు సైతం విభజనను ఆపలేకపోయాయి. ఈ అంశాలను అన్ని పార్టీలూ ‘రాజకీయం’గా వాడుకున్నాయి తప్ప ప్రజల అభీష్టానికి అనుగుణంగా పని చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఏకాకిగా భద్రాచలం..

రాష్ట్ర, జిల్లాల విభజనల తర్వాత ఈ డివిజన్ నుంచి విద్యాసంస్థలు, కార్యాలయాలు సైతం తరలిపోయాయి. భూభాగం కూడా తగ్గడంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. బీసీ, మైనార్టీ పాఠశాలలు మైదాన ప్రాంతాలకు తరలివెళ్లాయి. భద్రాచలంలో గిరిజన విద్యార్థులకు దిక్కుగా ఉన్న ప్రతిభ పాఠశాలను ఖమ్మం తరలించారు. యటపాకలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల సైతం ఏపీలోకి వెళ్లడంతో భద్రాచలం ఏజెన్సీ విద్యార్థులు సాంకేతిక కోర్సులకు దూరమయ్యారు. ఈ డివిజన్‌లో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు మార్చారు. రాజ్యాంగబద్ధంగా ప్రజాపాలనను పల్లెలకు దగ్గర చేసే జెడ్పీటీసీ, మండల పరిషత్ హోదాలు సైతం భద్రాచలానికి దూరమయ్యాయి. ఇక్కడి మండల పరిషత్‌ను ఆళ్లపల్లికి తరలించారు. ఏపీ విభజనతో పాలనా పరిధి తగ్గడం, కొండరెడ్లు, ఆదివాసీ తెగలు అధికంగా ఉండే ప్రాంతాలు ఏపీలో విలీనం కావడంతో ఐటీడీఏ నిస్తేజంగా మారింది.

మరమ్మతులు పూర్తి చేయాలి

పాల్వంచ: కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో నిర్వహిస్తున్న వార్షిక మరమ్మతులను ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య ఆదేశించారు. గురువారం ఆయన కర్మాగారంలో 250 మెగావాట్ల 10వ యూనిట్‌లో జరుగుతున్న మరమ్మతు పనులు పరిశీలించారు. బాయిలర్, టర్బైన్, జనరేటర్ విభాగాల్లో సందర్శించారు. పనుల్లో ఆలస్యం కావొద్దన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో 5,6,7 దశల సీఈ పి.వెంకటేశ్వర రావు, ఎం.ప్రభాకర్ రావు, ఎస్‌ఈలు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై వేటు?

- ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్య ఘటనతో చర్యలు
- అధికారికంగా ధ్రువీకరించని పోలీస్ శాఖ



అశ్వారావుపేట పోలీస్ స్టేషన్

అశ్వారావుపేటరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయగా.. సీఐపైనా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే, ఇందుకు సంబంధించి అధికారికంగా వివరాలు వెల్లడి కావాల్సిఉంది. అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ గతనెల 30వ తేదీ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ గత శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిని వరంగల్ ఐజీ కార్యాలయానికి, కానిస్టేబుళ్లు శేఖర్, శివ నాగరాజు, సుభాని, సన్యాసి నాయుడును అప్పట్లోనే ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈక్రమంలోనే ఎస్సై భార్య కృష్ణవేణి హైదరాబాద్‌లోని మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుతో ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదైంది. కాగా, ఎస్సై ఆత్మహత్య ఘటనను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించగా కానిస్టేబుళ్లు శేఖర్, శివ నాగరాజు, సుభాని, సన్యాసి నాయుడును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఇది జరిగి రెండు రోజులైనా ఉత్తర్వులు వెలువడలేదు. ఇక వరంగల్ ఐజీ అటాచ్‌లో ఉన్న సీఐ జితేందర్ రెడ్డిపైనా చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

అశ్వారావుపేట సీఐగా కరుణాకర్

అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో గడిచిన పది రోజులుగా జరిగిన పరిణామాలతో సిబ్బంది కొరత నెలకొంది. ఎస్సై ఆత్మహత్య ఘటనతో ఇక్కడ సీఐగా ఉన్న జితేందర్ రెడ్డి వరంగల్ ఐజీ ఆఫీసుకు అటాచ్ కావడంతో పోస్టు ఖాళీగా ఉంది. ఆయన స్థానంలో ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్‌కు అదనపు బాధ్యతలు కేటాయించారు. అంతేకాక సాధారణ బదిలీల్లో అశ్వారావుపేటకు ముగ్గురు కానిస్టేబుళ్లను కేటాయించగా వీరు గురువారం విధుల్లో చేరారు.

క్లుప్తంగా

రేపు జిల్లాకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

పాల్వంచరూరల్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం పాల్వంచలో వెల్లడించారు. ఈ నెల 13న సారపాకలోని ఐటీసీ కర్మాగారాన్ని సందర్శించనున్న హుస్సేన్ నాయక్ అధికారులతో సమావేశమయ్యాక గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడుతారని తెలిపారు. అనంతరం నవభారత్, కేటీపీఎస్‌ను సందర్శించి సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. కాగా, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి జిల్లాకు వస్తున్న హుస్సేన్‌నాయక్ సన్మానసభ గణేశ్‌సాయి కన్వెన్షన్ హాల్‌లో జరగనుండగా, విజయవంతం చేయాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు. సమావేశంలో చింతలచెరువు శ్రీనివాసరావు, రపాక రమేశ్, యడ్లపల్లి శ్రీనివాసకుమార్, భూక్యా రవి, సందీప్, దుర్గాప్రసాద్, నాగేంద్రప్రసాద్, నాగరాజు, శివ, అవినాష్ పాల్గొన్నారు.

సింగరేణిలో సర్వే అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న సర్వే అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా బెల్లంపల్లి ఏరియా ఖైరీగుడ ఓసీ సర్వే ఆఫీసర్ పి.రాజశేఖర్‌ను మణుగూరు పీకేఓసీకి, మణుగూరు పీకేఓసీ నుంచి దొంతుల ఓంప్రకాశ్‌ను కొత్తగూడెం ఏరియా ఏఎస్ఓ కార్యాలయానికి బదిలీ చేశా రు. అలాగే, మందమర్రి ఏరియా రామకృష్ణా పూర్‌లోని సీనియర్ సర్వే ఆఫీసర్ ఎండీ నజీరుద్దీన్‌ను మందమర్రి ఏరియా కేకే–5 గనికి, మందమర్రి ఏరియా ఆర్కే–1 ఇంక్‌లెన్‌లో సర్వే ఆఫీసర్ పండిల ప్రభాకర్‌ను మందమర్రి ఏరియా కాసీపేట గనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

వైద్యులు..

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ప్రాంతీయ వైద్యశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు వైద్యులు బదిలీ అయ్యారు గురువారం అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. జీఏ రవి కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రికి, బీఎస్‌కే సులోచన మందమర్రి కేకే–1 ఆస్పత్రికి బదిలీ అయ్యారు.

ముగిసిన తొలి దశ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): ఇంజనీరింగ్ తొలి దశ కౌన్సెలింగ్‌ను ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 2,329 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ నాగమునినాయక్ తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా సీట్ల కేటాయింపు ఉంటుందని, సీటు పొందినవారు 19వ తేదీ నుంచి 23వ తేదీ లోపు రిపోర్టింగ్‌తోపాటు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

ఈనెల 13 నుండి సింగరేణి వ్యాప్తంగా నిరసనలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు బ్లాక్‌ల వేలం నిలిపివేయాలనే డిమాండ్‌తో ఈనెల 13నుంచి 25వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. ఈమేరకు హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌యూఎస్, ఐఎఫ్‌టీయూ(ఎస్‌వీ) ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీతో కూడిన ఐక్యవేదిక నాయకులు గురువారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరుగు పందెం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా చేపట్టే నిరసనలు తెలపనుండగా అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

మణుగూరులో పర్యటించిన జీఎం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో జీఎం (రెస్క్యూ, ఎక్స్‌ప్లోరేషన్) శ్రీనివాసరెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంఎస్ ప్లాంట్ నిర్వహిస్తున్న తీరు, ఎక్స్‌ప్లోజివ్ పదార్థాలు నిల్వచేస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారి మణుగూరులో పర్యటించిన జీఎంను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు శ్యాం, వెంకటరమణ, రమేశ్, వెంకట్రావు, శ్రీనివాసమూర్తి, మదన్‌నాయక్, బాబుల్‌రాజ్, సాయిల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య కళాశాలలో 155 పోస్టుల భర్తీకి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ నోటిఫికేషన్ విడుదల చేయగా, 5,000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత గురువారం తెలిపారు. మెరిట్ ఆధారంగా పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతుండటంతో ఓ ఏజెన్సీ వారు హైకోర్టుకు వెళ్లారని, అందుకు సంబంధించిన పూర్తి సమాచారం హైకోర్టుకు విన్నవించామని చెప్పారు. కోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని, 155 పోస్టులు ప్రతిభ ఆధారంగానే భర్తీ చేస్తామని ఆమె వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

సబ్సిడీ కోసం ఎదురుచూపులు

- ఏళ్లు గడుస్తున్నా అందని వైనం..
- ఆందోళనలో ఎస్సీ యువతీ, యువకులు
- జిల్లాకు రావాల్సిన సబ్సిడీ మొత్తం రూ.6.63 కోట్లు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల సంక్షేమ కోసం పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. జిల్లాలో స్వయం ఉపాధి కోసం ఎంపికైన లబ్ధిదారులకు సబ్సిడీ విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఫలితంగా జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి అందని ద్రాక్షగానే మిగిలింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి 2020–21 ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాలో 390 యూనిట్లకు గాను రూ.10.67 కోట్లు కేటాయించింది. జిల్లాలోని 23 మండలాల నుంచి ఎస్సీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానించి, వాటి ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే, ఆ సమయంలో కరోనా ఉండటంతో ఇంటర్వ్యూలకు హాజరు కాలేకపోయామని కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో కొందరు యువతీ, యువకులు ఫిర్యాదు చేశారు.

అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు సార్లు ఇక్కడి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో 337 యూనిట్లకు గాను రూ.6,06,43,000 మంజూరు చేశారు. ఈ యూనిట్లకు సంబంధించి ఎంపికైన లబ్ధిదారుల నుంచి జోడు ఖాతా నంబర్లు తీసుకుని, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెక్కులు రూపొందించి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి పంపించారు. ప్రస్తుతం అక్కడ చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వంలోనే సబ్సిడీ విడుదల చేస్తామని చెప్పినా విడుదల చేయలేదు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

సబ్సిడీ విధానం ఇది..

లక్ష రూపాయల రుణానికి 80 శాతం సబ్సిడీ ఉంటుంది. రెండు లక్షల నుంచి పది లక్షల రూపాయల యూనిట్లకు 60 శాతం సబ్సిడీ లభిస్తుంది. జిల్లాలో 337 మంది లబ్ధిదారులు సబ్సిడీ కోసం ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా ఏటా ఇవ్వాల్సిన ఎస్సీ రుణాల నోటిఫికేషన్ ఇవ్వడం లేదు. ఫలితంగా ఎందరో ఎస్సీ యువతీ, యువకులు స్వయం ఉ పాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జిల్లాకు 31 ఆటోలు మంజూరు

జిల్లాలోని 23 మండలాలకు సంబంధించి 31 ఆటోలు మంజూరు చేశారు. ఆటోకు రూ.2.80 లక్షలు కాగా, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ.1.50 లక్షలు సబ్సిడీ వస్తుంది. మిగతా నగదును లబ్ధిదారులు వాటా కింద బ్యాంకులో జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేస్తే, బ్యాంకు అధికారులు రూ.2.80 లక్షలను ఆటో షోరూంకు పంపిస్తారు. రూ.8లక్షల యూనిట్ తీసుకుంటే రూ.4.80 లక్షలు సబ్సిడీ వస్తుంది. సుమారు 30 మంది ఈ రుణానికి ఎంపికయ్యారు.

ఏడాది అవుతున్నా సబ్సిడీ రాలేదు..



ఎస్సీ కార్పొరేషన్ రుణాల్లో ఆటోకు ఎంపికై ఏడాది కావొస్తోంది. ఇంకా సబ్సిడీ రాలేదు. జీవనోపాధి కష్టంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్వయం ఉపాధికి మార్గం చూపాలి. ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్క స్పందించి పెండింగ్‌లో ఉన్న చెక్కులను విడుదల చేయించాలి.

–కనకం సూరిబాబు, ఆటోడ్రైవర్, కొత్తగూడెం

మంత్రులు చొరవ తీసుకోవాలి..



స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలో ఎంపిక కావడంతో నాకు ఆటో మంజూరు చేశారు. సబ్సిడీ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ఆటో కొనుగోలు చేసే స్తోమత లేదు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. వారైనా మా విషయంలో చొరవ తీసుకొని, పెండింగ్‌లో ఉన్న చెక్కులను విడుదల చేయించి ఆదుకోవాలి.

–వేల్పుల భాస్కర్, సుజాతనగర్

ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం

ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల: మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని ఆదివాసీల సంక్షేమమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తోందని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామమైన చెన్నాపురంలో గురువారం చర్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ఏఎస్పీ అంకిత్ కుమార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహ కల్పించడంతోపాటు వైద్యం అందించేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. అమాయక ఆదివాసీలను మావోయిస్టులు తమ స్వార్థం కోసం వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి నిరోధకులుగా ఉన్న మావోయిస్టులు ఇకనైనా ఆదివాసీలకు స్వేచ్ఛ కల్పించాలన్నారు. మావోయిస్టులకు సహకరించొద్దని ఆదివాసీలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని చెప్పారు. చెన్నాపురం, పూసుగుప్ప గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వైద్య శిబిరానికి తరలివచ్చిన చెన్నాపురం, ఎర్రంపాడు, బట్టిగూడెం తదితర గ్రామాలకు చెందిన 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సరిహద్దు, మావో యిస్టు ప్రభావిత ప్రాంతాలైన పూసుగుప్ప, ఉంజుపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంపులను ఆయన సందర్శించారు. క్యాంపుల్లో అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించాలని, అనుమానితుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో చర్ల సీఐ ఏ.రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, పీవీఎన్ రావు స్పెషల్ బ్రాంచ్ ఎస్సై శ్రీనివాస్ చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ సాయివర్ధన్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి డాక్టర్లు విజయరావు, లోకేష్, దివ్య తదితరులు పాల్గొన్నారు.


స్థానికులకు మందులు అందజేస్తున్న ఎస్పీ

ఎన్‌ఎండీసీకి పూర్వవైభవం తేవాలి

పాల్వంచ/పాల్వంచరూరల్: పాల్వంచలోని ఎన్‌ఎండీసీ సంస్థకు చెందిన వనరులను వినియోగించుకుని, మరో కర్మాగారాన్ని అక్కడ ఏర్పాటు చేసి పూర్వ వైభవం తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు కోరారు. గురువారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి మరో మంత్రి భూపతిరాజు శ్రీనివాసశర్మతో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. నష్టాల్లో ఉందని స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను మూసివేశారని, దీంతో సుమారు 500 మంది ప్రత్యక్ష ఉద్యోగులు, పరోక్షంగా 5 వేల మంది కార్మికులు ఆదాయాన్ని కోల్పోయారన్నారు. 426 ఎకరాల్లో ఉన్న ఈ కర్మాగారం స్థానంలో గతంలో ఈఆర్‌డబ్ల్యూ పైప్స్ ప్లాంట్‌తో కోల్డ్ రోలింగ్ మిల్ ప్రాతిపాదన చేసి పెండింగ్‌లో ఉందని తెలిపారు. దీనిని తిరిగి మనుగడలోకి తీసుకొచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బానోతు బాలు నాయక్, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి శీలం విద్యాసాగర్, భద్రం తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న వినోద్‌రావు

ఆదర్శ నాయకుడు విశ్వనాథం


మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

ఇల్లెందురూరల్: విలువలతో కూడిన కార్యకర్తగా సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో పనిచేసిన విశ్వనాథం తన ఆదర్శాలను తుదకంటూ కొనసాగించాడని న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని 21పిట్ ఏరియాలో గురువారం విశ్వనాథం సంస్మరణ సభ ఎన్డీ నేత జడ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రొంపేడు ప్రాంతంలో న్యూడెమోక్రసీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించి అనేక నిర్బంధాలను ధైర్యంగా ఎదుర్కొన్నాడని గుర్తుచేశారు. పార్టీలో ఎవరు తప్పు చేసినా నిర్భయంగా ప్రశ్నించే తత్వం విశ్వనాథం సొంతమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎన్డీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు, సీపీఐ, సీపీఎం నేతలు నరాటి ప్రసాద్, అబ్దుల్ నబీ, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అనురాధ, శ్రీనివాస్, ఎన్డీ, మాస్‌లైన్, వివిధ ప్రజా సంఘాల నాయకులు గౌని ఐలయ్య, పేర్ల మధు, సంజీవరావు, ఉమామహేశ్వరరావు, రాసుద్దీన్, మోకాళ్ల రమేశ్, బయ్య శారద, ఆదిలక్ష్మి, హర్ష్య, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి వైద్యుల బదిలీకి రంగం సిద్ధం?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియాస్పత్రిలో వివిధ విభాగాల వైద్యులను బదిలీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏరియాస్పత్రిలో 60 మంది వైద్యులకు గాను కేవలం 16 మంది వైద్యులే విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదేళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్న వైద్యులను పలు కోణాల్లో పరిశీలించి బదిలీ చేయనున్నారని తెలిసింది. వైద్యశాలలోని 40శాతం మంది వైద్యులతో పాటు సిబ్బందిని కూడా బదిలీ చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం వర్షాకాలం, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండటంతో బదిలీలు తీవ్ర ప్రభావం చూపనుందని తెలుస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తే ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రాచలం జర్నలిస్టుకు పురస్కారం

భద్రాచలం: భద్రాచలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పీవీ సత్యనారాయణకు గురువారం బెస్ట్ జర్నలిస్టు పేరిట పురస్కారం లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉత్తమ కథనాలను అందించినందుకు గాను హైదరాబాద్‌కు చెందిన హైబిజ్ టీవీ మీడియా సంస్థ ఆయన్ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. గురువారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్, ఫుడ్, సివిల్ సప్లై శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పురస్కారాన్ని సత్యనారాయణకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్స్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, సాక్షి గ్రూపుల డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి తోపాటు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనుబాబు, కృష్ణమోహన్, మానెపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్యనారాయణకు అవార్డు రావడంపై భద్రాచలం పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

రేషన్ బియ్యం స్వాధీనం


ఇల్లెందురూరల్: పట్టుబడిన రేషన్ బియ్యంతో సీఐ సోమేశ్వర్, సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని పూసపల్లి గ్రామం నుంచి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా లచ్చగూడెం గ్రామానికి తరలిస్తుండగా ఇల్లెందు పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. సీఐ సోమేశ్వర్ కథనం ప్రకారం.. 50 బస్తాలలోడ్‌తో డీసీఎం వాహనం పూసపల్లి నుంచి లచ్చగూడెంవైపు వెళ్తుండగా పట్టుకున్నారు. డీసీఎం డ్రైవర్ లచ్చగూడెం గ్రామానికి చెందిన బత్తుల నవీన్‌ను విచారించగా లచ్చగూడెం గ్రామానికి చెందిన బత్తుల సంతోష్‌కు బియ్యం రవాణా చేస్తున్నట్లు తెలిపాడని, కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేశామని, రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించామని వెల్లడించారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: రేషన్‌షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రేషన్ షాపుని, వాహనాన్ని సీజ్ చేసి డీలర్, డ్రైవర్, కొనుగోలుదారుడిపై కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం తెలిపారు. మద్రాస్‌తండా రేషన్ షాపు నుంచి 35 క్వింటాళ్ల బియ్యాన్ని డీలర్ మాలోత్ రాజేందర్‌నాయక్ ట్రాలీఆటోలో పాల్వంచ మిల్లుకు తరలిస్తుండగా కొండంగులబోడు వద్ద గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి బియ్యంతో సహా ట్రాలీ, నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లయ్ డీటీ మహేశ్ బియ్యం, ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. రాజేందర్నాయక్, ట్రాలీ డ్రైవర్ పెద్దబోయిన సాయిలు, బియ్యం కొనుగులు చేసిన చక్రాల నరసింహారావుపై కేసు నమోదు చేశామని డీటీ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాలో ఘర్షణ

అశ్వారావుపేటరూరల్: ఇసుక అక్రమ రవాణా విషయంలో ఘర్షణ జరగ్గా గురువారం పోలీసులు కేసులు నమోదు చేశారు. స్థానిక ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలలోని అనంతారం గ్రామానికి చెందిన ఆరేపల్లి ప్రభాకర్ అనే వ్యక్తి బుధవారం రాత్రి గ్రామ శివారులోని పెద వాగు నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తున్నాడు. దీన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన దాసరి వరబాబు, రాము, కొప్పుల ధర్మరాజు అనే వ్యక్తులు అతడిని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య ఘర్షణ జరగ్గా.. తనపై కర్రలతో దాడి చేసినట్లు బాధితుడు ప్రభాకర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరోసారి దాడి.. పరస్పర ఫిర్యాదు

కాగా ఇదే వివాదంపై అనంతారం గ్రామంలో బుధవారం రాత్రి మరోసారి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన దాసరి నాగేంద్ర, రాము, కొప్పుల గణేష్ కలిసి తనపై దాడికి పాల్పడినట్లు బాధితుడు తేజవత్ రమేష్ ఫిర్యాదు చేశాడు. అదే విధంగా ఈ ఘర్షణలో తనపై ఆరేపల్లి గంగాధర్‌రావు దాడి చేయగా చేతి వేలు విరిగినట్లు నాగేంద్ర ఫిర్యాదు చేశాడు. పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

కొత్తగూడెంరూరల్: కుటుంబ నియంత్రణ పాటించడం చాలా ముఖ్యమని డీఎంహెచ్ఓ ఎల్.భాస్కర్ తెలిపారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు బాలాజీనాయక్, చైతన్య, స్పందన, మధువరన్, రాకేశ్, డిప్యూటీ డెమో ఎండీ ఫైజ్‌మొహిద్దిన్, డీపీహెచ్‌ఎన్ అన్నామేరీ, ఇనాక్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో మసీద్ సెంటర్‌ని రెండు దుకాణాల్లో బాల కార్మికులతో పనిచేయిస్తున్నట్లు బాలల సంరక్షణ విభాగం సభ్యులు గురువారం గుర్తించారు. మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దుకాణాల యజమానులపై టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

బూర్గంపాడు: సారపాక గ్రామ పంచాయతీలోని మేడేకాలనీకి చెందిన ఓ మహిళపై బుధవారం రాత్రి అదే కాలనీకి చెందిన వీరన్న దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వీరన్నపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేశ్ గురువారం తెలిపారు.

దూషించిన వారిపై..

బూర్గంపాడు: భజరంగ్ దళ్ సభ్యులను దూషించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సారపాకకు చెందిన ఫారూఖ్, ఫయాజ్ గురువారం భద్రాచలం నుంచి సారపాక వైపు ఆవులను తోలుకుని వస్తున్నారు. ఈ క్రమంలో భజరంగ్‌దళ్ సభ్యులు ఆవులను ఎక్కడికి తోలుకెళ్తున్నారని ప్రశ్నించారు. దానికి వారు పొంతన లేని సమాధానం చెబుతూ ఆవులను సారపాక తోలుకొని వచ్చి ఓ దగ్గర కట్టేశారు. ఆ ప్రాంతంలోనే ఉన్న బజరంగ్ దళ్ సభ్యులతో ఫారూఖ్, ఫయాజ్ వాగ్వాదానికి దిగారు. బజరంగ్ దళ్ సభ్యులకు చెందిన రెండు మోటార్ సైకిళ్లు ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పాల్వంచ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పట్టణంలోని కేటీపీఎస్ కాలనీకి చెందిన కేటీపీఎస్ ఉద్యోగి (జేపీఏ) భార్య కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం పలు రకాల మాత్రలు మింగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఇల్లెందు: మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కె.అనసూర్య (53) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అనసూర్య గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి మృతిచెందింది. మృతురాలి కుమారుడు విష్ణు ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

కొడుకు రూపం కళ్ల ముందే ఉండాలని..


ప్రవీణ్ విగ్రహం వద్ద నాయకులు, కుటుంబీకులు

టేకులపల్లి: ఏడాది కిందట ప్రాణాలు కోల్పోయిన కుమారుడి జ్ఞాపకాలను మాత్రం ఆ తల్లిదండ్రులు మరువలేకపోతున్నారు. దీంతో కుమారుడి రూపం ఎప్పటికీ కళ్ల ముందే ఉండాలనే భావనతో విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించుకున్నారు. మండలంలోని పాతతండాకు చెందిన భూక్యా ప్రేమ్‌కుమార్ – పద్మ దంపతుల కుమారుడు ప్రవీణ్‌రాథోడ్‌కు సివిల్ సర్వీసెస్ సాధించాలనే లక్ష్యం ఉండగా.. గతేడాది 17న హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఆ తర్వాత విడుదల చేసిన ఫలితాల్లో ఆయన ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైనట్లు వెల్లడైంది. అయితే, ప్రవీణ్ మృతి చెందిన నాటి నుంచి జ్ఞాపకాలు మరిచిపోలేకపోతున్న తల్లిదండ్రులు అచ్చు ఆయన మాదిరి విగ్రహాన్ని చేయించారు. దీన్ని గ్రామంలోని తమ పొలంలో ప్రవీణ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు కోరం సురేందర్, బానోత్ సరోజిని, రమేశ్, ఇందిర, కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

జాతి వైరం మరిచి..

మనుషుల మధ్య ద్వేషం తప్ప ఆప్యాయతలు కరువైన రోజులివి. కానీ, చూస్తూనే కస్సుబుస్సులాడుకునే ఓ కోతి, కుక్క మాత్రం జాతి వైరం మరిచి సరదాగా గడుపుతున్నాయి. అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో కుక్క, కోతి ఆప్యాయంగా కలిసి ఉండడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. –అశ్వాపురం

